బాధితులకు భరోసా..

మూసీ బాధితులను పరామర్శించిన బీఆర్ఎస్ నేతలు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ) : హైదర్షాకోట్‌లోని మూసీ బాధితులను మాజీ హోం మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రా రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, గంగుల కమలాకర్, బీఆర్ఎస్ నాయకులు కార్తీక్ రెడ్డితో కలిసి గురువారం పరామర్శించారు. బాధితుల ఇళ్లు కూల్చివేయకుండా అడ్డుకుంటామని, బుల్డోజర్లు, జేసీబీలు ఎన్నొచ్చినా తమను దాటుకొని వెళ్లాలన్నారు. బాధితులందరూ ధైర్యంగా ఉండాలని, ఆత్మవిశ్వాసం కోల్పోవద్దని, హైడ్రా పుణ్యమా అని ఇప్పటికే ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని, అలాంటి పరిస్థితి రాకుండా తాము వారికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఇందిరమ్మ పాలన అంటే పేదలకు కూడు, గూడు ఇచ్చేదని, కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన మాత్రం పేదల బతుకులను కూల్చివేసే ప్రయత్నం చేస్తున్నదని సీఎం రేవంత్ రెడ్డి పనితీరుపై మండిపడ్డారు. అవసరమైతే మూసీ తీరంలో ఏరియాకు ఒక ఎమ్మెల్యే ఉండి వారి ఇండ్లను కూల్చివేయకుండా కాపాడుతామని బాధితులకు హామీ ఇచ్చారు.

బాబాఖాన్ కుంటపై హైడ్రా ఫోకస్

ఇటీవల సర్వే నిర్వహించిన అధికారులు

నాలాలను పునరుద్ధరించాలని కోరుతున్న స్థానికులు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 29(నమస్తే తెలంగాణ): గ్రేటర్ శివారులో ఉన్న దుండిగల్ మున్సిపాలిటీ పరిధి.. బహదూర్‌పల్లిలోని బాబాఖాన్ కుంట వద్ద హైడ్రా అధికారులు సర్వే నిర్వహించారు. కుంట నుంచి వెలువడే మిగులు జలాలు నాలాలకు ప్రవహించి అక్కడినుంచి నేరుగా ఇతర చెరువుల్లోకి వెళ్లాలి. కానీ ప్రస్తుతం అలా జరగడం లేదు. నాలాలు పూర్తిగా కబ్జాకు గురవడంతో ఈ మిగులు జలాలన్నీ కాలనీవాసుల ఇళ్లలోకి వస్తున్నాయి. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వీరు హైడ్రాను సంప్రదించారు. తమ ప్రాంతంలో మిగులు జలాలు ప్రవహించే నాలాలు పూర్తిగా కబ్జాకు గురవడంతో తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీనిపై సర్వే చేసి తమకు న్యాయం చేయాలని హైడ్రాను కోరారు. ఈ నేపథ్యంలో హైడ్రా అధికారుల బృందం బాబాఖాన్‌కుంట వద్ద సర్వే నిర్వహించింది. ఇందుకు సంబంధించి ఇరిగేషన్ అధికారుల నుంచి కూడా నివేదిక కోరింది. త్వరలోనే ఇరిగేషన్ ఇచ్చే నివేదికతో పాటు మున్సిపల్ రికార్డులను పరిశీలించి హైడ్రా ఒక నిర్ణయం తీసుకోబోతోంది. బహదూర్‌పల్లి ప్రస్తుతం విలీన గ్రామం కావడంతో ఇక్కడి రికార్డులన్నీ మున్సిపల్ వద్దకు చేరాయి. ఇటీవల విలీన గ్రామాలన్నీ హైడ్రా పరిధిలోకి రావడంతో నాలాల ఆక్రమణలకు సంబంధించి స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. అర్బనైజేషన్ కాకముందు ఈ కుంట నిండితే అలుగు పారగానే తూము ఓపెన్ చేసి పంటకాల్వల ద్వారా నీటిని మళ్లించేవారు. కానీ క్రమక్రమంగా విల్లాలు, వెంచర్లు వచ్చి ప్రస్తుతం విలీనం కాకముందే ఈ ప్రాంతమంతా అభివృద్ధి చెందడంతో కుంటనీరు ఎటు మళ్లించాలో తెలియని పరిస్థితి వచ్చింది. నాలాలు ఉన్నట్లుగా స్థానికులు చెబుతున్నప్పటికీ.. అక్కడ ఉన్న స్థానిక రాజకీయ కారణాల వల్ల ప్రస్తుతం అధికారులకు ఇబ్బందిగా మారుతోంది.

బాబాఖాన్ కుంట ఇరిగేషన్ మ్యాప్

స్థానికుల ఆందోళన..

గ్రేటర్ శివారులోని బాబాఖాన్‌కుంట నుంచి వెలువడే మిగులు జలాలు ప్రవహించే నాలాలు కబ్జాకు గురయ్యాయని, వాటి ఆక్రమణలను తొలగించాలని బహదూర్‌పల్లి వాసులు హైడ్రాను డిమాండ్ చేస్తున్నారు. బాబాఖాన్ కుంట నిండిన తర్వాత మిగులు జలాలు వెళ్లేందుకు నాలాలు లేకపోవడంతో అక్కడి కాలనీలు వర్షాకాలంలో మునిగిపోతున్నాయని, వరదలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలోని దుండిగల్ మండల పరిధిలోని బాబాఖాన్ కుంట నుంచి రెండు ప్రధాన నాలాలు ఉన్నాయి. చెరువు నిండిన తర్వాత ఆ నీరంతా అలుగు నుంచి ఈ నాలాల ద్వారా ఇతర చెరువుల్లోకి వెళ్లేవి. కానీ ఇప్పుడు చెరువు నిండితే చాలు.. నాలాలు లేకపోవడంతో అక్కడి కాలనీలు, చెరువు ఎఫ్‌టీఎల్ అనంతరం ఏర్పడిన కాలనీలు ముంపునకు గురై స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. బాబాఖాన్ కుంట నుంచి ఒక నాలా అలుగు నుంచి బయలుదేరి అనంతరం రెండుగా విడిపోతుందని, విడిపోయిన నాలాలోని ఒక పాయ సర్వే నంబర్ 208,179,180ల మీదుగా వెళ్తుందని, వాటిని కొందరు ఆక్రమించుకుని తమ స్వార్థ ప్రయోజనాలకు వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హైడ్రా స్పందించి బాబాఖాన్ కుంట నాలాలను పరిరక్షించాలని,ఆక్రమణలను తొలగించాలని కోరుతున్నారు. నాలాలను హైడ్రా పునరుద్ధరిస్తే వాటి వెంట ఉన్న కాలనీలను కాపాడినట్లవుతుందని అభిప్రాయపడుతున్నారు.

బాబాఖాన్ కుంట వద్ద సర్వే నిర్వహిస్తున్న హైడ్రాఅధికారులు

పరిశీలించిన హైడ్రా బృందం

రెండు రోజుల క్రితం బాబాఖాన్ కుంటలోని పంట కాలువ, తూము రెండింటిని హైడ్రా అధికారులు పరిశీలించారు. అక్కడ డ్రైన్ ఏర్పాటు చేసి మిగులు జలాలను బయటకు పంపించాలా.. లేక నాలాలను ఓపెన్ చేయాలా అనే విషయంలో మ్యాపులతో పాటు స్థానిక పరిస్థితులను పరిశీలిస్తున్నారు. దీనిపై త్వరలోనే ఒక నిర్ణయం తీసుకోబోతున్నట్లు సమాచారం. ప్రధానంగా సర్‌ప్లస్ వాటర్‌ను మళ్లించడానికి ఎటువంటి చర్యలు తీసుకోవాలనే విషయంలో ఇరిగేషన్ అధికారుల నివేదికతోపాటు తమ రిపోర్ట్‌ను కూడా ఆధారంగా చేసుకుని నిర్ణయం తీసుకుంటారని తెలిసింది. ఈ విషయంలో ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు కూడా ఇదే విషయాన్ని చెబుతున్నారు.

మణికొండలో మాంగళ్య షాపింగ్ మాల్ ప్రారంభం

సందడి చేసిన గుంటూరు కారం ఫేమ్ సినీనటి శ్రీలీల

సిటీబ్యూరో, సెప్టెంబర్ 29(నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ నగరంలోని మణికొండలో మాంగళ్య షాపింగ్ మాల్ 22వ స్టోర్‌ను సినీ నటి శ్రీలీల జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నటి శ్రీలీల మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లో అధునాతన కలెక్షన్స్‌తో నిత్య నూతన వెరైటీలతో అతిపెద్ద షాపింగ్ మాల్‌గా మాంగళ్య అవతరించిందన్నారు. ఈ స్టోర్‌ను మణికొండలో ప్రారంభించడం ఆనందంగా ఉందని చెప్పారు. పట్టు, ఫ్యాన్సీ, కంచి, ధర్మవరం, ఉప్పాడ పట్టు చీరలతో పాటు, అధునాతన కలెక్షన్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కిడ్స్, ఎత్నిక్ వేర్ మెన్స్ అండ్ ఉమెన్స్ వివాహాది శుభకార్యాలకు ధరించే ప్రత్యేక వస్త్ర ప్రపంచం మాంగళ్య షాపింగ్ మాల్ అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీలీల షాపింగ్ మాల్‌లోని పట్టు, ఫాన్సీ సెక్షన్లు ఎత్నిక్‌వేర్ లేడీస్ జెంట్స్ కిడ్స్‌వేర్ అంతా కలియతిరిగి సందడి చేశారు. ఈ ప్రాంత వాసులు దసరా షాపింగ్ మాంగళ్యలో చేయాలన్నారు. షాపింగ్ మాల్ డైరెక్టర్లు పి.ఎన్.మూర్తి, కాసం నమ:శివాయ, కాసం మల్లికార్జున్, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పుల్లూరు అరుణ్ కుమార్ మాట్లాడుతూ... తెలుగు రాష్ట్రాల్లో గత 12 ఏండ్లుగా ప్రజల మన్ననలు పొందుతూ ఇప్పటివరకు 22స్టోర్‌లు ప్రారంభించామని తెలిపారు. అతి త్వరలో కర్ణాటక రాష్ట్రంలోనూ మా స్టోర్లను విస్తరించబోతున్నామని చెప్పారు. మా వస్త్రాలను ఎల్లప్పుడూ ఆదరిస్తున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు కృతజ్ఞతలు అని పేర్కొన్నారు. అధునాతన ఫ్యాషన్ డిజైన్లను అందించడానికి ప్రధాన కారణం మా సొంత మగ్గాలపై తయారు చేయడంతో వినియోగదారులకు తక్కువ రేటుకే నాణ్యమైన వస్త్రాలను అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాసం ఫణి, కాసం సాయికృష్ణ, కాసం ధీరజ్, డాక్టర్ కాసం ప్రీతం, తొడుపునూరి అరుణ్ కుమార్, కార్తీక్, విశాల్, వరుణ్ పాల్గొన్నారు. తొలుత అందాల తార సినీనటి శ్రీలీలను చూడటానికి ఉదయం నుంచి అభిమానులు, పరిసర ప్రాంత యువతీయువకులు బారులు తీరారు. యువతీయువకుల కేరింతలతో షాపింగ్ మాల్ ప్రాంతంలో పండగ వాతావరణం నెలకొంది. ముందుగా శ్రీలీల గుంటూరు కారం, ధమాకా పాటలకు స్టెప్పులు వేసి అభిమానులను అలరించింది.

వృద్ధులు భారం కాదు.. మన బాధ్యత

వయోవృద్ధుల ర్యాలీలో మంత్రి సీతక్క

ఖైరతాబాద్, సెప్టెంబర్ 29 : వృద్ధులు భారం కాదు.. మన బాధ్యత అంటూ అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ ర్యాలీలో రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ఆదివారం తెలంగాణ దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్లు సాధికారిత శాఖ ఆధ్వర్యంలో నెక్లెస్‌రోడ్‌లోని జలవిహార్ వద్ద ఏర్పాటు చేసిన వయోవృద్ధుల ర్యాలీని మంత్రి సీతక్క ప్రారంభించి మాట్లాడారు. పిల్లల్ని కనీ పెంచి ప్రయోజకులను చేసిన వయోవృద్ధులు అందరికీ ఆదర్శనీయులన్నారు. మనల్ని కన్న తల్లిదండ్రుల యోగక్షేమాలను బాధ్యతగా చూసుకోవాలన్నారు. ప్రస్తుతం సంస్కృతి మారడంతో ఉమ్మడి కుటుంబాలు ఉండటం లేదన్నారు. ఉన్నత ఉద్యోగాలు చేస్తూ కూడా తమ తల్లిదండ్రులను వృద్ధాశ్రమాల్లో వేస్తున్నారని తెలిపారు. ఆస్తుల కోసం తల్లిదండ్రుల హత్యలు జరుగడం బాధాకరమన్నారు. వయోవృద్ధుల సంరక్షణను పిల్లలు గాలికొదిలేస్తున్నారని పేర్కొన్నారు. వయోవృద్ధుల కోసం తీసుకువచ్చిన చట్టాన్ని ఎవరూ ఉల్లంఘించినా శిక్షలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్లు సాధికారితశాఖ డైరెక్టర్ శైలజ, దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తి నేని వీరయ్య, సిటిజన్లు పాల్గొన్నారు.

పెరుగుతున్న జీర్ణశయాంతర, కాలేయ వ్యాధులు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 29(నమస్తే తెలంగాణ) : దక్షిణ భారతంలో జీర్ణశయాంతర, కాలేయ వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయని యశోద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ సదస్సులో పలువురు గ్యాస్ట్రోఎంటరాలజీ వైద్య నిపుణులు అభిప్రాయపడ్డారు. హైటెక్ సిటీలో ఆదివారం నిర్వహించిన జీఐ డిజార్డర్స్ అత్యవసర పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా జీర్ణశయాంతర రుగ్మతలు, కాలేయ వ్యాధులు అంటువ్యాధి వలే వేగంగా వ్యాప్తి చెందుతున్నాయన్నారు. 500కు పైగా గ్యాస్ట్రోఎంటరాలజీ(జీఐ) వైద్య నిపుణులతో నిర్వహించిన సదస్సులో జీర్ణశయాంతర రుగ్మతలు, కాలేజీ సంబంధిత వ్యాధులతో ఏటా 2.68లక్షలకు చేరుకున్నాయని తెలిపారు. యశోద గ్రూప్ హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పవర్ గోరుకంటి మాట్లాడుతూ... జీఐ, కాలేయ వ్యాధిగ్రస్తుల అవసరాలకు అనుగుణంగా ఆధునాతన వైద్య సాంకేతిక పరిజ్ఞానం యశోద హాస్పిటల్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. తీవ్రమైన జీర్ణశయాంతర రక్తస్రావం, ప్రేగు అడ్డంకులు, తీవ్రమైన కాలేయ వైఫల్యం, ప్యాంక్రియాటైటిస్, ఫ్యాటీ లివర్, వైరల్ హెపటైటిస్, సిర్రోసిస్, లివర్ ఫెయిల్యూర్ వంటి అనారోగ్య సమస్యలకు విభిన్న వైద్య విధానాలు, చికిత్స ప్రణాళికలు, వ్యాధి నివారణ, ముందస్తుగానే గుర్తించడం, స్క్రీనింగ్ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో యశోద వైద్యుల బృందం, డా.నవీన్, డాక్టర్ సంతోష్, కేఎస్ సోమశేఖర్ రావు, డాక్టర్ గోపీ శ్రీకాంత్, డాక్టర్ శరత్ చంద్ర పాల్గొన్నారు.

గాంధీ తత్వం నేటి తరానికి తెలిసేలా పాదయాత్ర

అక్టోబర్ 2నుంచి జనవరి 12వరకు 100 రోజులు వెయ్యి కిలోమీటర్ల పాదయాత్ర

తెలుగు యూనివర్సిటీ, సెప్టెంబర్ 29: సమాజ శ్రేయస్సు కోరుతూ గాంధీతత్వాన్ని నేటి తరానికి తెలియజేయాలనే ఆశయంతో శివార్చక విజయకుమార్ చేపట్టిన పాదయాత్రకు ప్రభుత్వ యంత్రాంగం సహకరించాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. గాంధేయవాది, విద్యావేత్త డాక్టర్ శివార్చక విజయకుమార్.. గాంధీజయంతిని పురస్కరించుకుని గాంధీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే లక్ష్యంతో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో అక్టోబర్ 2నుంచి జనవరి 12వరకు చేపట్టిన వందరోజుల్లో వెయ్యి కిలోమీటర్ల పాదయాత్ర పోస్టర్‌ను రమణాచారి తన కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేవీ రమణాచారి మాట్లాడుతూ.. అలంపూర్ జోగులాంబ దేవాలయం నుంచి అక్టోబర్ 2న ప్రారంభిస్తున్న పాదయాత్ర అచ్చంపేట ఉమామహేశ్వర దేవాలయం వరకు సాగి జనవరి 12న ముగుస్తుందన్నారు. గాంధీజీ బాటలో నడుస్తున్న విజయకుమార్ చేపట్టిన పాదయాత్ర విజయవంతం కావాలన్నారు. సమాజం విపత్కర పోకడలతో జీవనం సాగిస్తున్న తరుణంలో గాంధేయవాదం ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ప్రయత్నం గొప్పదని ప్రముఖ రచయిత, కవి గంటా మనోహర్‌రెడ్డి ప్రశంసించారు.కార్యక్రమంలో సాహితీవేత్తలు పి. బడేసాబ్, డాక్టర్ విజయకుమార్, ప్రభాకర్‌రెడ్డి, అబ్దుల్‌రజాక్, పూర్ణచందర్ పాల్గొన్నారు.

పాదయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేవీ రమణాచారి తదితరులు

దామగుండం విధ్వంసానికి కుట్ర

కేబీఆర్ పార్క్ వద్ద పర్యావరణ ప్రేమికుల ఆందోళన

సిటీబ్యూరో, సెప్టెంబర్ 29(నమస్తే తెలంగాణ): వికారాబాద్ జిల్లా దామగుండం అడవి పరిరక్షణ కోసం తెలంగాణ ఉద్యమకారులు మల్లేపల్లి నర్సింహులు ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్క్ వద్ద ఆదివారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. దామగుండంలో 2900 ఎకరాల భూమిని నేవీ రాడర్ స్టేషన్ కోసం అడవిని నాశనం చేయడం మంచిది కాదని నర్సింహులు అన్నారు. రాడార్ స్టేషన్ ఏర్పాటుతో అడవి విధ్వంసమవుతుందని, పర్యావరణం పాడవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అడవిలో 500 ఏండ్ల చరిత్ర గల రామలింగేశ్వర స్వామి గుడి విధ్వంసానికి గురవుతుందని వివరించారు. డెబ్బై వేల మంది ప్రజలు అక్కడ అడవిపైనే ఆధారపడి ఉన్నారని, వాళ్లంతా ఆగమవుతారని తెలిపారు. అడవి విధ్వంసంతో రాబోయే రోజుల్లో అందరూ ఆక్సిజన్ సిలిండర్లు పెట్టుకునే దుస్థితి వస్తుందన్నారు. అడవి విధ్వంసానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని ఆరోపించారు. సుమారు 12 లక్షల చెట్లు, నరికివేతకు గురవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మార్నింగ్ వాకర్స్, అనిత, శివకుమార్, భగవాన్, స్వామి, అశోక్ పాల్గొన్నారు.

ఓసీటీ పుస్తకావిష్కణ

కార్డియో వాస్కులర్ సమస్యల కారణంగా ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా 20.5 మిలియన్ల మరణాలు సంభవిస్తున్నాయని కిమ్స్, సన్‌షైన్ ఆసుపత్రుల కార్డియాలజీ హెచ్‌వోడీ, కార్డియో థొరాసిక్ సర్జన్, సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీధర్ కస్తూరి పేర్కొన్నారు. కిమ్స్, సన్‌షైన్ ఆసుపత్రిలో జరిగిన వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకుని డాక్టర్ శ్రీధర్ కస్తూరి రాసిన ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టులకు ఉపయోగపడే ప్రొసీజర్ లిటరేచర్ పుస్తకం ఓసీటీ (వన్ పోర్టల్ వేవ్ దే కెన్ యాక్సిస్ ఏటు జెడ్) ఆవిష్కరణ జరిగింది. అనంతరం జరిగిన కేక్ కటింగ్‌లో కార్డియాలజీ విభాగం సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టులు డాక్టర్ శైలేందర్‌సింగ్, డాక్టర్ ఎస్.విజయ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ ఆర్. రాజారాం పాల్గొన్నారు. – బేగంపేట్, సెప్టెంబర్ 29

టీజీడీఏ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ నరహరి

ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్ ఎన్నిక

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వైద్యుల సంఘం ఎన్నికల్లో గెలిచిన డాక్టర్ నరహరి, డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్‌లను సన్మానిస్తున్న సభ్యులు

సుల్తాన్ బజార్, సెప్టెంబర్ 29: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వైద్యుల సంఘం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఆదివారం కోఠిలోని వైద్య భవన్‌లో నిర్వహించిన ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్ష రేసులో ఉన్న డాక్టర్ నరహరి 63 ఓట్లతో, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటీలో ఉన్న డాక్టర్ లాలు ప్రసాద్ రాథోడ్ 55 ఓట్లతో విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో మొత్తం 89 ఓట్లు ఉండగా అధ్యక్ష పదవిలో ఇద్దరు పోటీ చేయగా డాక్టర్ నరహరి భూపేందర్‌పై 63 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. కాగా ప్రధాన కార్యదర్శి పదవికి ఇద్దరు పోటీ చేయగా డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్ 55 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. కాగా మిగిలిన సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. టీజీడీఏ సంఘానికి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన డాక్టర్ నరహరి, డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్‌లను డాక్టర్ రమేశ్, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ రంగా అజ్మీరా, డాక్టర్ సిద్దిపేట రమేశ్, డాక్టర్ వినోద్, డాక్టర్ రవికుమార్ పూలమాలలతో సన్మానించారు.

రాజీవ్ రహదారి రోడ్డు విస్తరణను తగ్గించాలి

- జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ తేలుకుంట సతీశ్ గుప్తా
- 200 అడుగుల నుంచి 100 అడుగులకు కుదించాలి: జేఏసీ

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ తేలుకుంట సతీశ్ గుప్తా

మారేడ్‌పల్లి, సెప్టెంబర్ 29: సికింద్రాబాద్ జింఖానా మైదానం నుంచి తూంకుంట వరకు విస్తరించే రాజీవ్ రహదారి రోడ్డు విస్తరణను తగ్గించాలని రాజీవ్ రహదారి రోడ్డు విస్తరణ బాధితుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసి) కన్వీనర్ తేలుకుంట సతీశ్ గుప్త కోరారు. ఆదివారం కార్ఖానాలోని అమరావతి కాలనీలో రాజీవ్ రహదారి ప్రాపర్టీ ఓనర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ సతీశ్ గుప్త మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ రహదారి రోడ్డును జింఖానా గ్రౌండ్ ప్యారడైజ్ నుంచి తూంకుంట వరకు 200 అడుగుల వెడల్పుతో విస్తరణ చేపట్టేందుకు నిర్ణయించిందని తెలిపారు. దీని వల్ల రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణదారులు, ప్రజల నివాస గృహాలు, విద్యా సంస్థలు, ఆసుపత్రులు, ఫర్నీచర్, వివిధ షాపులు నిర్వహించే వారు జీవనోపాధికి నష్టం కల్గుతుందన్నారు. దీంతో పాటు వేల మంది కార్మికులు తమ ఉపాధిని కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే రోడ్డు విస్తరణ పనులకు జాయింట్ యాక్షన్ కమిటీ వ్యతిరేకం కాదని, 200 నుంచి 100 అడుగులకు కుదించి విస్తరణ పనులు చేపట్టాలని కోరారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, హిమాయత్‌నగర్, బేగంపేట వంటి కీలక ప్రాంతాల్లోనే రోడ్డు విస్తరణ 100 అడుగులతో చేపట్టారని పేర్కొన్నారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులను కలిసి సమస్యను వివరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు ఉప్పలంచ అమర్‌నాథ్, బొమ్మ శ్రీరాం, కొమరవెల్లి వెంకన్న పాల్గొన్నారు.

ముగిసిన లాంబ్కాన్ 2024

అమీర్‌పేట్, సెప్టెంబర్ 29 : తల్లి పాలివ్వడాన్ని ప్రభావితం చేసే కారణాల్లో సి–సెక్షన్ కూడా ఒకటని, సి–సెక్షన్ల సంఖ్యను తగ్గించడంపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించిందని ఆరోగ్య కుటుంబ శాఖ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ పేర్కొన్నారు. ప్రారంభ దశలో తల్లి పాలను ప్రోత్సహించడానికి నర్సులు, ఇతరులకు తగిన శిక్షణనిచ్చే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. అమీర్‌పేట్‌లోని హోటల్ మారీగోల్డ్‌లో రెండు రోజుల పాటు జరిగిన తల్లి పాలివ్వడం, నిర్వహణ, తల్లి పాల బ్యాంకింగ్‌పై 4వ దక్షిణాసియా అంతర్జాతీయ సదస్సు లాంబ్కాన్ 2024 ఆదివారం ముగిసింది.